క్లుప్తంగా

పాఠశాలలో పనులు పరిశీలన

మామడ: మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను గురువారం ఎంపీడీవో రమేశ్ సందర్శించారు. మన ఊరు– మన బడిలో భాగంగా చేపట్టిన పనులు పరిశీలించారు. పనుల వివరాలను ప్రధానోపాధ్యాయుడు రాంచందర్‌ను అడిగి తెలుసుకున్నారు.

భూమిపూజ

లోకేశ్వరం: గ్రామాల్లో అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. గురువారం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో జెడ్పీ నిధులు రూ.రెండు లక్షలతో డ్రైయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. సర్పంచ్ రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, గంగాధర్, రాజు, రాజారెడ్డి, ప్రశాంత్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.ఆరు లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ గణేశ్ గురువారం ప్రారంభించారు. త్వరలోనే అన్ని వీధుల్లో రోడ్డు ఏర్పాటు పనులు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రజాక్, ఉప సర్పంచ్ గోనేకర్ శంకర్, కార్యదర్శి శ్రీలత తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి అండ



నగదు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నిర్మల్‌కు చెందిన పోలకొండ స్రవంతి కుటుంబానికి నకాశ్ వెల్ఫేర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. ఈ మేరకు గురువారం బాధితురాలిని ఫౌండేషన్ సభ్యులు కలిసి రూ.25వేల నగదు అందించారు. ఫౌండేషన్ చైర్మన్ బ్రహ్మరౌతు రాజ్‌సాగర్, శ్రీనివాస్, రాజేశ్, రమేశ్, రామకృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో కొటిక్‌వార్ విఠల్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. గురువారం ఫైనల్‌లో విజేతగా నిలిచిన ఇలేగాం జట్టుకు ట్రోఫీతోపాటు నగదు అందించారు. అనంతరం దాత కొటిక్‌వార్ కృష్ణమూర్తిని పలువురు అభినందించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమీపంలో చంద్రశేఖర్ అనే ఉపాధ్యాయుడు గురువారం తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కమ్యూనికేషన్ చంద్రభానుకు సదరు ఫోన్ దొరకగా వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్లో సీఐ మల్లేశ్‌కు అందజేశారు. వెంటనే సీఐ.. ఉపాధ్యాయుడికి సమాచారమిచ్చి పోగొట్టుకున్న ఫోన్‌ను అప్పగించారు.

కార్మికుల పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న కార్మికులు

కడెం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం పంచాయతీ కార్మికులు మండలంలోని ధర్మాజీపేట్ గ్రామం నుంచి కడెం వరకు పాదయాత్ర చేశారు. అనంతరం ఎంపీడీవో లింబాద్రికి వినతి పత్రం అందజేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు, కారోబార్లకు స్పెషల్ స్టేటస్, నాలుగు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

లక్ష్మణచాంద: అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పోషకాహారం లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి అన్నారు. గురువారం మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయ, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరం

కుంటాల: వ్యాధుల బారిన పడకుండా మూగజీవాలకు నట్టల నివారణ మందు అందించాలని పశువైద్యాధికారి ప్రకాశ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అందాకూర్ గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్, శశిధర్ పాల్గొన్నారు.

సదరం శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో గురువారం మానసిక వికలాంగులకు సదరం క్యాంపు నిర్వహించారు. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఈ శిబిరానికి హాజరయ్యారు. వైద్యులు సురేశ్, అల్లాడి ప్రవీణ్‌కుమార్ శిబిరానికి హాజరైన వారిని పరీక్షించి వైకల్య పాయింట్లు నమోదు చేశారు. శిబిరంలో 30 మంది రెగ్యులర్, 30 మంది రెన్యూవల్ దరఖాస్తు చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

బడిలో కూరగాయల సాగు

- పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు
- తాజా కూరగాయలతో మధ్యాహ్న భోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



కిచెన్‌గార్డెన్‌లో కూరగాయలు తెంపుతున్న విద్యార్థులు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. పాఠశాలలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి అందులో పండిన తాజా కాయగూరలనే మధ్యాహ్న భోజనంలో వండిపెడుతున్నారు. దీంతో తమకు మంచి ఆహారం అందుతుందని విద్యార్థులు.. ప్రతీసారి బయట కాయగూరలు కొనే బాధ తప్పిందని మధ్యాహ్న భోజన నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేంద్రియ పద్ధతిలో సాగు..

రోజురోజుకు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కలుషిత వాతావరణం, ఎక్కువ రసాయనాలతో పండించిన కూరగాయలు తెచ్చి మధ్యాహ్న భోజనం వండిపెట్టడంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. మరోవైపు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సైతం అంతంత మాత్రంగానే బిల్లులు అందుతుండటంతో నామమాత్రంగానే పిల్లలకు వంట చేసి పెడుతున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు కలిసి బడి ఆవరణలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి సేంద్రియ పద్ధతిలో కాయగూరలు, ఆకుకూరలను పండిస్తున్నారు.

రెండుగుంటల్లో ఏర్పాటు..

ఈ ప్రాథమిక పాఠశాలలో 82 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల ఆవరణలో గ్రామస్తులు, రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో కూరగాయల సాగు కోసం రెండు గుంటల భూమి కేటాయించారు. దీంతో రోజు మొక్కలకు నీరు పోయడం, కలుపు తీయడం వంటి పనులు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా చేస్తున్నారు. ఐదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు మాత్రమే కలుపు తీస్తున్నారు. ఉపాధ్యాయులు.. రోజు విద్యార్థులను కిచెన్‌గార్డెన్‌లోకి తీసుకెళ్లి సాగువిధానంపై అవగాహన కల్పిస్తున్నారు. సెలవు దినాల్లో కూడా పాఠశాలకు వచ్చి నీళ్లు పడుతుండటంతో కాయగూరలు ఏపుగా కాయడంతోపాటు పాఠశాల ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. తడి, పొడి చెత్తతో తయారు చేసిన సేంద్రియ ఎరువులను వినియోగిస్తుండటంతో మంచి దిగుబడి వస్తుంది.



కలుపు తీస్తున్న హెచ్‌ఎం ఎల్లన్న

19 రకాల కూరగాయలు..

పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్‌గార్డెన్‌లో 19 రకాల కూరగాయలు పండిస్తున్నారు. టమాట, వంకాయ, బెండకాయ, బీరకాయ, కాకరకాయ, సొరకాయ, బొబ్బర, దోస, పూగోబి, ఆకుగోబి, చిక్కుడు, బఠాణి, ముల్లంగి, ఉల్లి, వెల్లుల్లి, మిర్చి, పాలకూర, కొత్తిమీర, మెంతికూర తదితర పంటలను పండిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నారు



పాఠశాలలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటుతో మాకు కూరగాయలు ఎలా సాగు చేస్తారో తెలిసింది. గతంలో పప్పు, పులుసు ఎక్కువగా తినేవాళ్లం. ప్రస్తుతం తాజా కాయగూరలు తింటున్నాం. ఉపాధ్యాయులు మాకు కూడా పండించే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

– గౌతమి, ఐదో తరగతి

పిల్లల ఆరోగ్యం కోసం

ప్రస్తుతం తాజా కూరగాయలు దొరకడం కష్టమవుతోంది. గ్రామస్తుల సహకారంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పాఠశాలలోనే కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలను పండిస్తున్నాం. ఇక్కడ పండిన వాటితో మధ్యాహ్న భోజనం వండుతున్నాం. కలుపు తీయడం, నీటిని పడుతుండటంతో మంచి దిగుబడి వస్తుంది.

– ఎం.ఎల్లన్న, హెచ్‌ఎం

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే శనగ పంటకు మద్దతు ధర లభిస్తుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం బాసరలో శనగ పంట కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం శనగ పంట ఇళ్లకు చేరిందని.. ప్రభుత్వం క్వింటాలుకు రూ.5,335 మద్దతు ధర అందిస్తుందన్నారు. ప్రైవేటు వారికి విక్రయించకుండా కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, బాసర సర్పంచ్ లక్ష్మణ్‌రావు, మండల ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు, సర్పంచుల సంఘం మండలాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, బాసర బీఆర్‌ఎస్ కన్వీనర్ శ్యాం, నాయకులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రం సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం అశోక్ అన్నారు. గురువారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రంలో పంట విక్రయిస్తే రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

‘హామీలు నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ విఫలం’

దస్తురాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని రేవోజీపేట గ్రామంలో ప్రజాగోస–బీజేపీ భరోసాలో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నాసికరంగా చేపట్టి ఎమ్మెల్యే అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. బీజేపీ నాయకులు హరినాయక్, మండలాధ్యక్షుడు లక్ష్మణ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రఘు, రాజేశం, వెంకటరమణ, వెంకన్న, గంగాధర్, తిరుపతి, స్వామి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



రేవోజీపేటలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రమేశ్

కన్కపూర్‌లో ప్రజాగోస–బీజేపీ భరోసా

లోకేశ్వరం: రాష్ట్రంలో కేసీఆర్ పాలన నిజాం తుగ్లక్ పాలనను గుర్తు చేస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దడిగే భోజన్న అన్నారు. గురువారం మండలంలోని కన్కపూర్ గ్రామంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించారు. భోజన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బద్దం భోజారెడ్డి, వేణు, బీజేపీ మండలాధ్యక్షుడు గంగాధర్, రమేశ్, శ్రీనివాస్‌రావు, దేవేందర్ ఉన్నారు.

మామడ: మండలంలోని లింగాపూర్‌తండాలో గురువారం బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ చేరికల కమిటీ చైర్మన్ భూపతిరెడ్డి మాట్లాడారు. బీజేపీ మండల కన్వీనర్ కొరిపల్లి లింగారెడ్డి, రాములు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయింపు

ఖానాపూర్: పట్టణంలోని కుమరం భీం చౌరస్తాలో అంబేద్కర్ సంఘ భవన నిర్మాణం కోసం రెండెకరాలు కేటాయించినట్లు ఎమ్మెల్యే రేఖానాయక్ తెలిపారు. స్థలం కేటాయింపు కాపీని గురువారం పట్టణంలోని తన నివాసంలో నాయకులకు అందించి మాట్లాడారు. మంత్రి ఐకేరెడ్డి దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి సైతం రూ.50లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, ఎంపీపీ మోహిద్, రాజగంగన్న, సంతోష్, రాజశేఖర్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ప్రవీణ్‌కుమార్ కృషితోనే స్థలం కేటాయింపు..

ఇటీవల ఖానాపూర్ పర్యటన సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్.. ఎమ్మెల్యే గతంలో ఇచ్చిన హామీని ప్రశ్నించడంతోనే అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఈదుల ప్రతాప్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.



ఎమ్మెల్యేతో దళితసంఘాల నాయకులు

ఎమ్మార్పీ భవనం ప్రారంభం..

పెంబి: మండలకేంద్రంలో ఎమ్మార్పీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి సోదరుడు మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వేణునగర్ సర్పంచ్ రాధను పరామర్శించారు. వైస్‌ఎంపీపీ గంగారెడ్డి, ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్, సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, ఎంపీటీసీ రామారావు, విక్రంనాయక్, శ్రీను ఉన్నారు.

నేడు జాతర

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో శుక్రవారం నుంచి బాపూజీ మహారాజ్ జాతర ప్రారంభం కానుంది. ఏటా శివరాత్రి పండుగ తర్వాత వచ్చే పంచమి రోజున బాపూజీ మహారాజ్ జాతర నిర్వహిస్తారు. ఈ సారి శుక్ర, శనివారాల్లో బాపూజీ మహారాజ్ జాతర జరుగనుంది. జాతర కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాన్ని శుభ్రం చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు కోసం ఆలయ ప్రాంగణంలో టెంట్లు వేసి నీటి సౌకర్యం కల్పించారు. శుక్రవారం బాపూజీ మహారాజ్ పల్లకిసేవ నిర్వహిస్తారు.

సేవలతోనే గుర్తింపు

నిర్మల్‌టౌన్: ఉత్తమ సేవలతో నిర్మల్ పట్టణ సీఐ నాగపురి శ్రీనివాస్ గుర్తింపు పొందారని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ ఇన్‌లో గురువారం బదిలీపై వెళ్తున్న సీఐ శ్రీనివాస్‌కు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ, ఆర్‌ఎంఓ వేణుగోపాల్, సీఐలు మల్లేశ్, రాంనరసింహారెడ్డి, ఎస్సైలు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలి

ఖానాపూర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని ఖానాపూర్ సీఐ నారాయణ నాయక్ అన్నారు. పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఆటోడ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను నిలిపినా, మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్.శంకర్, ఆటోడ్రైవర్లు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెంబి: సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ సీఐ నారాయణ నాయక్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీ, పిన్‌నంబర్ అడిగితే చెప్పవద్దన్నారు. ఏవరైనా వేధిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం పెంబి పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, పాకల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్, కడెం ఎస్సై రాజు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ నారాయణ నాయక్

సాయిబాబా ఆలయంలో పూజలు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు. మధ్యాహ్న హారతి అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గురువారం అన్నదాతలుగా నిలిచిన ఓదెల చందన, వంగ లలిత సాయిబాబాగౌడ్ దంపతులను ఆలయ ప్రాంగణంలో ట్రస్టీ చైర్మన్ లక్కడి జగన్మోహన్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, సోమేశ్, భూషణ్, చౌదరి, ఆమెడ శ్రీధర్‌తోపాటు వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కల్లూరులో..

కుంటాల: రెండో షిరిడీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు పూజలు నిర్వహించారు.

అటెన్షన్ ప్లీజ్..

బొడ్డోనికుంట కలుషితం



ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీ బొడ్డోనికుంటలోకి వివిధ కాలనీల డ్రెయినేజీ నీరు వచ్చి చేరుతోంది. దీంతో సదరు కుంటలోని నీరంతా కలుషితంగా మారుతోంది. గత వారం చెరువులో పెంచుతున్న చేపలు మృతి చెందాయి. ఈ నీటిని తాగే పశువులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రత్నాకర్‌రావు, మున్సిపల్ కమిషనర్, ఫోన్: 9440040793

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి పంచాయతీ ఆవరణలో గురువారం ముగ్గురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వైస్‌ఎంపీపీ మామిడి నారాయణ్ రెడ్డి అందించారు. గ్రామానికి చెందిన చిన్న భోజన్న, సాయన్న, భోజన్నకు కలిపి రూ.26 వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పంచగుడి సర్పంచ్ ఎల్లన్న, రాజేశ్వర్, ప్రకాశ్, సాయన్న, సైలాన్ ఉన్నారు.

‘సదస్సు విజయవంతం చేయండి’

భైంసాటౌన్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు డా ముష్కం రామకృష్ణాగౌడ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మార్చి 12న మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించే సదస్సుకు ఉద్యమకారులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

‘కోళ్ల ఫాంపై చర్యలు తీసుకోవాలి’

సారంగపూర్: మండలంలోని గోపాల్‌పేట్‌తండా సమీపంలో ఉన్న కోళ్ల ఫాంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో దుర్వాసన వస్తుందని.. అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు కరిపె విలాస్ అన్నారు. గురువారం గోపాల్‌పేట్ తండాలో బీజేపీ నాయకులు మాట్లాడారు. గ్రామంలో కోళ్ల ఫాంతో దుర్వాసన వస్తుందని.. ఎటు చూసినా ఈగలు, దోమలు వ్యాప్తి అధికంగా ఉందన్నారు. ఇప్పటికే గోపాల్‌పేట్, సోనాపూర్ తదితర తండాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. బీజేపీ స్టడీ సర్కిల్ స్టేట్ కన్వీనర్ వెంకటేశ్, మండల ప్రధాన కార్యదర్శి చాణక్య, తిరుమలచారి, గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, నర్సయ్య, చందు, జీవన్ తదితరులు ఉన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	20
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	25

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : సార్
నారాయణ: వినరో భాగ్యము విష్ణు కథ

అంతర పంట సాగు అభినందనీయం

లక్ష్మణచాంద: సోన్ మండలం న్యూబొప్పారం గ్రామంలో ఆకర సిద్దన్న ఆయిల్‌పాం తోటలో అంతర పంటలు సాగు చేయడం అభినందనీయమని సోన్ ఏఈవో అంబాజీ అన్నారు. సిద్దన్న రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోటలో అంతర పంటగా కొత్తిమీర, పాలకూర సాగు చేస్తున్నాడు. గురువారం గ్రామంలో పర్యటించిన ఏఈవో అంబాజీ.. ఆయిల్‌పాం తోట పరిశీలించి సిద్దన్నకు పలు సూచనలు చేశారు. ఆయిల్‌పాంలో కలుపు పెరగదని.. ఇందులో అంతర పంటలు సాగు చేస్తే ఆర్థిక ప్రగతి సాధించవచ్చని పలువురు రైతులకు సూచించారు. ఆయన వెంట ఆయిల్‌పాం అధికారి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.



అంతర పంటను పరిశీలిస్తున్న ఏఈవో అంబాజీ

యువత బాగా చదువుకోవాలి

లోకేశ్వరం: యువత సమయం వృథా చేయకుండా బాగా చదువుకోవాలని లోకేశ్వరం ఏఎస్సై దిగంబర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రలోని వేదనిధి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, డయల్100పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా ఉన్నత చదువులు అభ్యసించాలన్నారు. గ్రామాల్లో అపరిచితులు కన్పిస్తే 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జానకీరాం, సాయిలు, హరిప్రసాత్, విష్ణురవీందర్, పోలీసులు మోహన్, జితేందర్ ఉన్నారు.

అందరూ కంటిపరీక్షలు చేసుకోవాలి

కడెం: 18 ఏళ్ల నిండిన వారు తప్పనిసరిగా కంటిపరీక్షలు చేయించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య, సర్పంచ్ సొదాని శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటివెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, పలువురు వైద్య సిబ్బంది గోపాల్, తదితరులు ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని గురువారం తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో సురేశ్ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. గురువారం శిబిరానికి వచ్చిన వారికి వైద్యాధికారి సురేశ్ కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పలువురికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, శ్వేత, సురేశ్, సిబ్బంది రవీందర్, శివకృష్ణ గౌడ్, వనజ తదితరులు పాల్గొన్నారు.



ముధోల్‌లో పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో